**కథ**

-కె. విజయలక్ష్మి

# తృప్తి

**ఆదివారం...ఉదయం పదవుతోంది.**

**రెండోసారి కాఫీ తాగుతూ..తీరిగ్గా వరండాలో కూచుని పేపర్ చదువుతున్నాను.**

**"సార్..సార్.."**

**ఎవరో పిలుస్తున్నట్టనిపించి తలెత్తాను.**

**ఎదురుగా పదిహేను పదహారేళ్ళ కుర్రాడు. నలిగిన మాసిన బట్టల్తో దైన్యంగా చూస్తున్నాడు.**

**పరిశీలనగా చూస్తే ముష్టికొచ్చిన కుర్రాడిలా అన్పించటం లేదు. దారిద్ర్యం కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది.**

**ఎవరీ కుర్రాడు?**

**ఎందుకొచ్చినట్టు?**

కనుబొమలు ఎగరేసి 'ఏవిటి?' అన్నట్టు చూశాను.

నా కళ్ళ భాష అర్థమైనవాడిలా ధైర్యంగా రెండడుగులు ముందుకేసి..

''సార్! మాది పూర్ ఫ్యామ్లీ. టెన్త్ క్లాస్ మంచి మార్కులతో పాసయ్యాను. చూడండి'' మార్కుల లిస్ట్ చేతికిచ్చాడు.

టోటల్ ఐదొందల పదకొండు.

''మా నాన్న రిక్షా లాగుతాడు. అమ్మ నాలుగిళ్ళల్లో పాచి పని చేస్తుంది. నాకు బాగా చదువుకోవాలని ఆశగా వుంది. నాన్నేమో రిక్షా లాగమంటున్నాడు. సార్ మీలాంటి చదువుకున్న వాళ్ళు దయతలచి సహాయం చేస్తే కష్టపడి చదువుకుంటాను సార్! అమ్మకి చదివించాలని ఆశగా వున్నా స్థోమత లేక నాన్న మాట వినమంటోంది. కానీ..కానీ నాకా పని ఇష్టం లేదు సార్! సార్..సార్ మీరు ఎంతోకొంత దయతలచి సాయం చెయ్యండి సార్!'' ఎంతో దీనంగా జాలిగా అర్థిస్తున్నాడు.

వాడి కళ్ళు మాత్రం ఎంతో ఆశగా రెపరెపలాడుతూ నా వేపు చూస్తున్నాయి.

నా మనసు మెలిపెట్టినట్టయ్యింది. అమ్మా నాన్నా అన్ని సౌకర్యాలు అమర్చిపెడితే ఫ్రెండ్స్‌తో ఉల్లాసంగా కబుర్లు చెప్పుకుంటూ జాలీగా కాలేజీకి వెళ్ళే వయస్సు.

ప్చ్..వాడి చదువుకోసం వాడే పదిమంది ముందూ చేయి చాచవలసిన నిర్భాగ్యపుస్థితి, కన్న కలల్ని సాకారం చేసుకోటానికి..తన బంగారు భవిష్యత్తుకి తనే పునాదులు నిర్మించుకోటానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్న ఆ కుర్రాడి పట్టుదల చూస్తుంటే ముచ్చటేసింది.

సరస్వతి అక్కున చేర్చుకున్నా...ధనలక్ష్మి కన్నెర్ర చేయటం వల్ల సరస్వతీ కటాక్షాన్ని మరింతగా పొందటం కోసం వీధినపడ్డ దౌర్భాగ్యుడు.

వేలకి వేలు డబ్బు పోసి పేరున్న కాన్వెంట్లలోనూ..కార్పొరేట్ కాలేజీల్లోనూ చదివిస్తుంటే ఫస్ట్ క్లాస్ రావటానికి తలప్రాణం తోక్కొస్తోంది. మనమే ఎగ్జామ్స్‌కి వెళుతున్నట్టు వాళ్ళతోపాటు మనమూ నైటవుట్లు చెయ్యాలి. అంత హైరానాపడ్డా, మావాడికి టెంత్ టోటల్ నాలుగొందల పన్నెండు మార్కులొచ్చాయి. దానికే మా ఆవిడ మురిసి ముక్కలైపోతూ...టాప్‌లో వున్న కార్పొరేట్ కాలేజీల లిస్ట్ తయారు చేస్తోంది. అక్కడికి మావాడు ఐఏఎస్ టాప్ రాంకొచ్చినంత హడావిడి చేస్తూ హైరానా పడుతోంది.

పాపం కడుపునిండా మంచి తిండి, శుభ్రమైన బట్టలు లేకపోయినా చదువుకోవాలనే ఆ పసివాడి తపన కళ్ళు చెమర్చేలా చేసింది. పదిమంది సాయంకోరైనా చదువు కొనసాగించాలనే బలమైన ఆ కోరికకు అబ్బురపడ్డాను. ఆ పసిమనసులో ప్రగాఢమైన కోరిక నింపి వాడికి నికృష్టమైన దారిద్ర్యాన్నంట్టగట్టిన ఆ దేవుడి మీద చాలా కోపం వచ్చింది.

వాడి కళ్ళు నా వైపు ఆశగానే చూస్తున్నాయి.

''ఏ గ్రూపు తీసుకుంటావు?'' నోరు విప్పాను.

నా మాట విన్న తర్వాత వాడి ఆశలకి జీవం వచ్చినట్టుంది.

''ఎమ్‌పీసీ సార్! మాథ్స్‌లో హండ్రెడ్ పర్సెంట్ వచ్చింది'' ఉత్సాహంగా చెప్పాడు.

మళ్ళీ తనే..

''మీలాంటి దయామయుల సహాయ సహకారాలు..ఆశీసులు వుంటే కంప్యూటర్ ఇంజనీర్‌నవుతాను సార్'' ఆ మాట అంటున్నప్పుడు వాడి కళ్ళల్లో ఏంత మెరుపులు నాచూపుని దాటి పోలేదు. ఆ మాటల్లోని దృఢత్వం వింటుంటే గోల్‌ని ఖచ్చితంగా రీచవుతాడనిపించింది.

''వెరీ గుడ్! ఇదే పట్టుదల సడలకుండా కష్టించి చదువుకో పైకొస్తావ్'' మార్కుల లిస్ట్ వాడి చేతిలో వుంచి ఇంట్లోకెళ్ళాను.

ఆండాళ్ ఇంట్లో వున్నట్టుంది అంటే కిచెన్లో... వీడి వయసు వాడే రాజేష్ ఫ్రెండ్స్‌తో కల్సి ఏ మార్నింగ్ షోకో వెళ్ళినట్టున్నాడు. చిన్నాడు ఏ ఆటలకెళ్ళాడో ఇంట్లో అలికిడే లేదు. అవునూ..ఇంతకీ ఈ కుర్రాడి పేరేంటి? అడగాలి.

పర్స్‌లోంచి ఐదొందల నోటు తీశాను.

''ఇప్పటిదాకా ఎవర్తో మాట్లాడుతున్నారు?'' హఠాత్తుగా వూడిపడి ఆరాతీసింది.

వులిక్కిపడ్డాను. పట్టుబడిన దొంగలా అయ్యింది నా పని. ''అది కాదు ఆండాళ్ళు పాపం ఎవరో పూర్ స్టూడెంట్. టెన్త్ ఎంత మంచి మార్కులతో పాసయ్యాడో తెలుసా?..మన బడుద్ధాయి వున్నాడు ఎంతసేపు క్రికెట్..సినిమాలు..ఫ్రెండ్స్..చదువు మీద బొత్తిగా ధ్యాసలేదు. ఈ కుర్రాడ్ని చూసి బుద్ధి తెచ్చుకోమను'' అన్నాను. అంతే...


వార్నింగ్ లేకుండానే యుద్ధం మొదలైంది. ఇంతెత్తున ఎగిరింది. ''చాల్లే వూరుకోండి. ఆ

గతిలేని వాడితో నా కొడుకుని పోలుస్తారా? మీకు బుద్ధుందా? నా బిడ్డ తప్పు మీకు అందరూ బుద్ధిమంతుల్లానే కనిపిస్తారు. ఈ ఐదొందల నోటెందుకు?''

''పాపం ఆ అబ్బాయి చదువు కోసం..'' నా మాట పూర్తి కాలేదు.

''అనుకున్నా..ఇటువంటి పనికి మాలిన పని చేస్తారని. చదువువంకన అడుక్కోడానికి వాడు రావటం.. అదంతా మీరు నమ్మేసి పెద్ద దానకర్ణుడిలా బయలుదేరారు. మీకు తెలీదు ఈ డబ్బుతో గంజాయి.. మందు.. సిగరెట్టు ఒకటేముంది వాళ్ళకి అన్ని చెడు అలవాట్లు వుంటాయి. ఏదో వంకన ఇలా దండుకు పోతుంటారు'' గుర్రాన్ని గాడిదని ఒకే గాటన కట్టేస్తూ మాట్లాడింది.

ఆండాళ్ చేసిన ఆరోపణలకి..అభిప్రాయాలకి కించిత్ బాధనిపించింది.



''మరీ అంత దారుణంగా మాట్లాడకు. నువ్వన్నట్టు మోసగాళ్ళు వుంటారు. మాటల గారడీతో సొమ్ము చేసుకునే వారు వుంటారు. అంతమాత్రాన అందర్నీ అనుమానించి మాట్లాడ్డం అన్యాయం. వాడు మెరిట్ స్టూడెంటని ఆ మార్కుల లిస్టే చెబుతోంది. ఎలాంటి సౌకర్యాలు లేని ఒక గవర్నమెంట్ స్కూల్లో చదివి మంచి మార్కులు సాధించినందుకు మన లాంటి చదువుకున్న వాళ్ళే అప్రిషియేట్ చేసి..ఆర్థికంగా ప్రోత్సాహన్నందిస్తే వాడు ముందు ముందు మరెంతో అభివృద్ధిలోకి వస్తాడు'' కన్విన్స్ చెయ్యాలని చూశాను.

''చాల్లెండి! మీ బడాయి మాటలు. వాడు ముష్టెత్తుకొని చదువు వెలగబెట్టకపోతే దేశానికి నష్టంరాదు లెండి! తెల్లారి లేచింది మొదలు ఈ బాపతు వాళ్ళు బోలెడు మంది అమాయకంగా మొహాలు పెట్టి..జాలిగొలిపేలా మాటలు చెప్పి ఎంతో కొంత పట్టుకుపోతుంటారు. అది వాళ్ళ వృత్తి..మనిషికో మాట చెప్పి బతికేస్తుంటారు'' చేతిలో నోటు గబుక్కున లాక్కుంది.

''పాపం ఆ కుర్రాడు అలాంటి వాడులా లేడు.. సాయం చేస్తానని చెప్పాను. ఆ నోటు ఇలా ఇవ్వు ఆండాళ్ళూ'' బతిమాలాను.

''అక్కర్లేదు! వాడికి సరయిన జవాబు నేను చెబుతాగా'' విసురుగా బయటకెళ్ళింది.

అసలు నా తెలివి తక్కువతనంవల్లే ఇలా జరిగింది. పిల్లలంటే పంచప్రాణాలు. అలాంటిది పరాయివాడి ముందు రాజేష్‌ని తక్కువ చేసి మాట్లాడాను ఇహ సహిస్తుందా! అసలే కోతి.. ఆపై కల్లు తాగింది అన్నట్టు చెలరేగిపోతోంది. చదువు అంతగాలేని ఆండాళ్‌కి చదువు దాని విలువ... చదువువల్ల వచ్చే గౌరవ మర్యాదలు గురించి ఏం తెలుస్తుంది. ఇహ సంస్కారం గురించి మాట్లాడాలంటే అది ఆమె డిక్షనరీలోనే లేదు. తెల్సిందలా లొడ లొడ మాట్లాడ్డం..మంచి చెడుల గురించి ఆలోచించకుండా గయ్‌మని


పోట్లాడ్డం..పిల్లల (ఫ్రెండ్స్) ఇంటికి ఎవరేనా వచ్చినా హడాలిపోయేలా చేస్తుంది. అంతా నా ఖర్మ.

అరిచి గోల చేస్తుందని ఎదురు చూస్తుంటే లోపలికొచ్చి తనే చెప్పింది.

''బయట ఎవరూ లేరు.. వాడొట్టి మోసగాడు. అందుకే నేను వెళ్ళేసరికి వుడాయించాడు. నేను ముందే చెప్పాను కదా!'' తన అంచనా ఎప్పటికీ తప్పు కాదన్నట్టు ఆమెలో గొప్ప ఆత్మవిశ్వాసం.

'అలాంటివాడిలా అన్పించటం లేదు. వాడి కళ్ళల్లోను...మాటల్లోను ఎంతో నిజాయితీ స్పష్టంగా తెలుస్తోంది. ఆ చిన్ని గుండెలో బంగారు భవిష్యత్ గురించి ఎన్ని ఆశలు..కోరికలు గూడుకట్టుకున్నాయో.. ఆండాళ్ లాంటి వాళ్ళు పదిమంది వుంటే చాలు ఇలాంటి పేదవాడి కలలు కల్లలుగా మిగిలిపోతాయి' ప్రాణం వుసూరుమంది.

''నువ్వాడిన వీరంగమంతా వాడి చెవుల పడి హడలిపోయుంటాడు. ఇహ నిన్ను చూసే ధైర్యం లేక ఆ పసి వెధవ పారిపోయింటాడు'' కోపంగా అన్నాను.




''ఛీ.. ఛీ.. మీకెప్పుడు నన్నాడిపోసుకోవటమే. నన్నెప్పుడు సరిగ్గా అర్థం చేసుకున్నారు కనుక'' వచ్చిన పని పూర్తి అవగానే నన్ను.. వాడ్ని తిట్టుకుంటూ ఏదో మాడు వాసన రాగా పరుగెత్తుకుంటూ వంట గదిలో కెళ్ళింది.

మళ్ళీ పేపర్ చదివే మూడ్ లేదు. మనసంతా పాడయ్యింది. కుర్చీలో జారగిలపడి కళ్ళు మూసుకున్నాను. వాడి దీన వదనమే కన్పిస్తోంది. గబుక్కున లేచి షర్ట్ తగిలించుకొని రాజేష్ సైకిల్ తీసుకొని నాలుగు వీధులు తిరిగాను. ఊహు.. ఎక్కడా కన్పించలేదు. ఛ ఛ ఎంత తప్పు చేశాను? పెళ్ళాం చూస్తుండగా ఐదొందలుతో నా ఇష్టపూర్వకమైన పని చేయలేకపోయాను. అపాత్రదానం ఎంత అనర్థమో...అర్హుడికి సాయం అందించకపోడం కూడా అంతే తప్పు...మనసంతా ఆవేదనతో నిండిపోయింది.

## మహిమ రూటే వేరు!

**ఆమధ్య టెన్నిస్ స్టార్ లీండర్ పేస్‌తో చెట్టాపట్టాలేసుకుంటూ తిరిగిన బాలీవుడ్ భామ మహిమా చౌదరి అతనితో వచ్చిన గొడవల వల్ల దూరమైందిప్పుడు. అయితే అతి త్వరలోనే మహిమ పెళ్లిచేసుకోబోతోందని వినిపిస్తున్న వార్తల్ని ఇటీవల ఆమె చాలా తెలివిగా ఖండించింది. 'నేను అసలు పుకార్లని పట్టించుకోను. అలాగే మాగజైన్లు ఎక్కువగా చదవను. ఇలాంటి ప్రశ్నలకు నా నుంచి ప్రస్తుతానికి ఎలాంటి జవాబులూ రావు' అంటూ దాటేసింది.**



★ ★ ★

పది రోజులు గడిచినా ఆ దీనవదనమే కళ్ళ ముందు కదలాడుతోంది. ఆఫీస్‌కెళ్ళి వస్తున్నానే కానీ వర్క్ మీద కాన్‌సన్‌ట్రేట్ చెయ్యలేకపోతున్నాను.

ఓ రోజు వాకింగ్‌కెళ్ళి వస్తున్నాను. పేపర్ బాయ్ ఎదురయ్యాడు. నా కళ్ళు సంతోషంతో మెరిసాయి. ఆపాను. నన్ను గుర్తుపట్టినట్టున్నాడు. ''గుడ్‌మార్నింగ్ సార్!'' ఎంతో వినయంగా చెప్పాడు.

''వెరీ గుడ్ మార్నింగ్''

''ఇంతకీ కాలేజీలో జాయిన్ అవుతున్నావా?''

''ఆ ప్రయత్నం మీదే సార్ ఈ పని చేస్తున్నాను. మీలాంటి సహృదయులు కొంత సాయం చేశారు''

ఆ మాటతో చెంప ఛెళ్ళు మన్నట్టయ్యింది. అలా అనటంలో వాడి ఉద్దేశం అది కాకపోయినా.. నాకలా అన్పించింది.

''నేను వెళతాను సారూ..ఇంకా చాలా ఇళ్ళున్నాయి'' సైకిలెక్కబోయాడు.

హేండిల్ పట్టి ఆపాను. ''నీ పేరేంటి?''

''వెంకట సుబ్బారావు సార్''

''చూడు వెంకట్, ఇంటర్ రెండు సంవత్సరాల ఫీజ్ నేనే ఇస్తాను. నువ్వు మాత్రం బాగా చదువుకో. అన్ని అవకాశాలు వుండి చదవలేని వాళ్ళకి నువ్వు చెంపపెట్టులా వుండాలి. నీలాంటి పేదవాళ్ళకి స్ఫూర్తి కావాలి. నువ్వు డబ్బుకోసం ఇంటికి రావద్దు. ఆఫీస్‌కి రా'' అంటూ ఆఫీస్ అడ్రసిచ్చాను. వెంకట్ సైకిల్ మీద దూసుకుపోయాడు.

నాకు తెలుసు, వాడు కలల్లో తేలిపోతూ వెళతాడని. నాకు పది రోజులుగా గుండెల్లో గూడుకట్టిన ఆవేదనంతా ఆవిరయ్యింది. ఇప్పుడెంతో ప్రశాంతంగా.. హాయిగా వుంది. ఎంతో తృప్తిగా, సంతోషంగా వుంది. ఒక మంచిపని కోసం తీసుకున్న నిర్ణయం ఇంత ఆనందాన్ని.. ఆత్మసంతృప్తిని ఇస్తుందని అర్థమైంది. గుండె నిండుగా సంతోషంతో ఇంటికి చేరాను. ☆